వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 320 | సోమవారం | 06 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# బాధ్యతలు చేపట్టిన ఇనుగాల



కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుడా వైస్ ఛైర్మెన్ డా.అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొని ఇనుగాలకు శుభాకాంక్షలు తెలిపారు.

-వరంగల్ వాయిస్, హనుమకొండ

# ఇగోలు మానండి..






వివరాలు 2లో..

- సొంతింటి కల సాకారానికి అడుగు దూరంలో జర్నలిస్టులు
- సహకరిస్తున్న ఎమ్మెల్యేలు
- అయినా ముందుకు రాని సిక్స్‌మెన్ కమిటీ, సొసైటీ బాధ్యులు
- ఏకతాటిపై ముందుకెళ్తే నెలలోనే నివేశన స్థలాలు

కలిసి వెళ్తే కలదు సుఖం.. విడివిడిగా ఉంటే తీరని నష్టం..అన్నది అందరికీ తెలిసిందే. దీనిని మన సీనియర్ జర్నలిస్టులు మరువరాదు. పెద్ద మనుసుతో వ్యవహరించాలి. సాధారణ జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చేలా చేయూతనివ్వాలి. అప్పుడే సిక్స్‌మెన్ కమిటీ సభ్యులకు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ బాధ్యులకు మరింత గౌరవం లభిస్తుంది. ఈ తరం జర్నలిస్టులంతా వారిని కడుపులో పెట్టుకుంటారు. నివేశన స్థలాలు వచ్చినందుకు చిరకాలం గుర్తుంచుకుంటారు. ఆ దిశగా జర్నలిస్టు యూనియన్ నాయకులతో కూడిన సిక్స్‌మెన్ కమిటీ, రెండు హౌసింగ్ సొసైటీ బాధ్యులు ఐక్యంగా ముందుకు సాగాలి. ఇందుకోసం ఇగోలు మరిచి ఎవరికి వారే చొరవ చూపాలి. ఇప్పటికే సొసైటీలకు ప్రభుత్వం భూములు కేటాయించినందున మిగతా ప్రాసెస్ త్వరితగతిన పూర్తి చేయాలి. అవసరమైతే రెండు రోజుల సమయం కేటాయించాలి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజుతో కలిసి హైదరాబాద్ లోనే మకాంవేసి జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసి విజయగర్వంతో తిరిగి రావాలి.

– వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి



# ఇగోలు మానండి..



**సొంతింటి కల సాకారానికి అడుగు దూరంలో జర్నలిస్టులు**

**సహకరిస్తున్న ఎమ్మెల్యేలు**

**అయినా ముందుకు రాని సిక్స్‌మెన్ కమిటీ, సొసైటీ బాధ్యులు**

**ఏకతాటిపై ముందుకెళ్తే నెలలోనే నివేశన స్థలాలు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** సొంతింటి కల సాకారానికి జర్నలిస్టులు అడుగు దూరంలోనే ఉన్నారు. ఇప్పటికే జర్నలిస్టు సొసైటీలకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఇంకా కావాలన్నా ఇచ్చేందుకు హనుమకొండ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు సిద్ధంగా ఉన్నారు. అయితే ఇప్పుడు కావాల్సిందల్లా సిక్స్‌మెన్ కమిటీ, రెండు హౌసింగ్ సొసైటీ బాధ్యుల చొరవు. వీరు సాధారణ జర్నలిస్టులకోసం కొంత సమయం కేటాయిస్తే నెలలోనే నివేశన స్థలాలు కల నెరవేరుతుంది. కల సాకారం కావాలంటే ఇగోలు పక్కనబెట్టాలి. అందరూ ఏకతాటిపైకి రావాలి. కలిసికట్టుగానే జిల్లా మంత్రులు, ఇంచార్జి మంత్రి, ముఖ్యమంత్రి, ప్రెస్ అకాడమీ చైర్మన్‌ని కలిసి గ్రేటర్ వరంగల్ పరిధిలోని జర్నలిస్టులు మూడు దశాబ్దాల కలను వారికి వివరించాలి. వారినుంచి సానుకూల దృక్పదం వచ్చే వరకు వారి వెన్నంటి ఉండాలి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తే సమస్యలు పరిష్కారం కావు.. వరంగల్ నగరంలోని పాత్రికేయుల చిరకాల ఆకాంక్షలు నెరవేరవు.

## నేల విడిచి సాము..

వరంగల్ నగర జర్నలిస్టుల సొంతింటి కల సాకారం కాకపోవడానికి యూనియన్ల నేతలు, జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల్లో బాధ్యులైన కొందరు ఇగోలతో వ్యవహరించడమేనని విమర్శలొస్తున్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందనేలా వ్యవహరిస్తున్నారని కింది స్థాయి జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. 2009లో కాకతీయ, ఏకశిల జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉత్వర్వులు ఇచ్చినా నేటికీ పంపిణీ చేయకపోవడానికి కారణం ఎవరు..? రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తే మన వరంగల్ నగరంలోనే జాప్యం కావడానికి కారణాలేంటి..? దీనిపై యూనియన్ల నేతలు పునరాలోచించాలి. సొసైటీల్లో లేని జర్నలిస్టులకు సైతం ఇళ్ల స్థలాలు కావాలని కొన్నేళ్లుగా పోరాడుతున్న నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సుమారు పది నెలల క్రితం మడిపల్లిలో 13 ఎకరాలు కేటాయించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సీసీఎల్ఏకు లెటర్ పెట్టారు. దీనికి నాటి, నేటి వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు సుముఖత తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలోనే కార్యాచరణ పూర్తి చేయాలని భావించారు. సిక్స్‌మెన్ కమిటీ, సొసైటీల బాధ్యులు కలిసి రావాలని వారు కోరినా కొందరు సమన్వయంతో వ్యవహరించకపోవడంతో ఆ రోజు పూర్తి కావాల్సిన ఇళ్ల స్థలాల వ్యవహారంలో జాప్యం ఏర్పడింది. మేము సహకరిస్తామంటున్నా మీరు ఐక్యంగా ఎందుకు రావడం లేదని ఎమ్మెల్యేలే బాహాటంగా చెప్పడం సిగ్గుచేటు. ఇది మనకు అవమానకరంగా భావించాలి.

## కలిసి రండి..

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని సంధానకర్తగా నియమించారు. అయితే మన యూనియన్ల నేతలు, సిక్స్‌మెన్ కమిటీ బాధ్యులు దీనిని పట్టించుకోవడం లేదు. నగరానికి మంత్రులు వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు. ఫొటోలకు ఫోజులిస్తూ మభ్యపెడుతున్నారు. జర్నలిస్టు సొసైటీల సభ్యులకు, మిగతా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు దక్కాలంటే మీడియా అకాడమీ చైర్మన్ సహకారం మనకు అవసరం. రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మన జిల్లాకు ఇంచార్జి మంత్రిగా ఉన్నారు. ఇంత మంచి అవకాశం మరెప్పుడూ రాదు. వరంగల్ నగరంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇప్పించేలా హైదరాబాద్‌కు సిక్స్‌మెన్ కమిటీ, సొసైటీల బాధ్యులు కలిసి వెళ్లాలి. అవసరమైతే రెండు రోజులు అక్కడే ఉంటే మన ఆకాంక్ష నెరవేరుతుంది. ఇంతటి బృహత్తర కర్తవ్యాన్ని నెరవేరిస్తే మిమ్మల్ని జర్నలిస్టులంతా కొలుస్తారు. సొంతింటి కల నెరవేరితే మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటారు.

## అందరినీ కలుపుకుపోండి..

వీడి పెత్తనమేంది.. వాడి మాట వినేదేంది.. అని అనుకోకండి.. అందరినీ కలుపుకుపోండి.. ఇప్పటి వరకు జరిగిన నష్టం ఇక చాలు. మనం సాధించిన విషయాలు.. భవిష్యత్ కర్తవ్యాన్ని జర్నలిస్టులకు వివరించండి. ఇళ్ల స్థలాల విషయంలో యూనియన్ల నాయకుల్లో కొందరు ఏకపక్ష ధోరణితో ఉన్నారు. దీంతో మన ఆకాంక్ష నెరవేరడం లేదని వాట్సాప్ గ్రూపుల్లో అనేక మంది జర్నలిస్టులు పోస్టులు పెడుతున్నాఎవరూ స్పందించడం లేదు. కొందరు తెలిసీ తెలియక పోస్టులు పెడుతున్నారు. వారి సందేహాలను నివృత్తి చేసేలా వివరణ ఇచ్చే ప్రయత్నం చేయడం లేదు. సీఎం, మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసి ఇళ్ల స్థలాల పంపిణీకి కృషి చేస్తామని చెప్పడంలో సిక్స్‌మెన్ కమిటీ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా అందరినీ కలుపుకుపోయేలా చూడాలి. ఇందుకు సొసైటీల బాధ్యులు సైతం తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి. హనుమకొండ, వర్ధన్నపేట ఎమ్మెల్యేల సహకారంతో సిక్స్‌మెన్‌కమిటీ, సొసైటీల బాధ్యులు హైదరాబాద్‌కు కలిసి వెళ్తే ఈ నెలాఖరులోగా మన ఇళ్ల స్థలాల పంపిణీ పూర్తవుతుందనడంలో సందేహం లేదు.

## తూర్పులోనూ సమస్యే..

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న దారిధ్య రేఖకు దిగువన ఉన్న జర్నలిస్టులకోసం గత ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దేశాయిపేటలో డబుల్ బెడ్ రూములను నిర్మించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి కేటీఆర్ తో ప్రారంభోత్సవం చేయించి ఆయన చేతుల మీదుగా నలుగురికి ఇంటి పట్టాలు కూడా పంపిణీ చేయించారు. ఎన్నిక సమయంలో కూడా జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూంలను అందించిన ఘనత మాదే అంటూ గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ఈ మేరకు బ్యానర్లు కూడా కట్టారు. తీరా ఎన్నికలు పూర్తి కాగానే కేటీఆర్ చేతుల మీదుగా పంపిణీ చేసిన ఇంటి పట్టాలను కూడా తిరిగి తీసుకున్నారు. నిర్మాణాలు పూర్తి అయినా ఇప్పటికీ పంపిణీ చేపట్టక పోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇంటి కిటికీలు, తలుపులు, పైపులు ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం జరిగింది. అయితే బీపీఎల్ కింది తూర్పు జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇంటి పట్టాలు అందజేయాలన్న వాదన ఎంతో కాలంగా వినిపిస్తుంది. ఈ విషయంలో కూడా జర్నలిస్టు యూనియన్ బాధ్యులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు చొరువ చూపించి త్వరగా వాటిని అందజేయాలని స్థానిక జర్నలిస్టులు కోరుతున్నారు. అయితే బీపీఎల్ కింద ఇచ్చే డబుల్ బెడ్ రూంలను నివేశన స్థలాలతో ముడిపెట్టకుండా రెండింటికి తూర్పు జర్నలిస్టులను అర్హులుగా చేయాల్సిన బాధ్యత కూడా సీనియర్ జర్నలిస్టులపైనే ఉంది..

# ఘనంగా కడియం జన్మదిన వేడుకలు

**భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు**

**వరంగ్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి 73వ పుట్టినరోజు సందర్బంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేక్ కట్ చేశారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్బంగా అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం, రైతాంగ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప మహనీయులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. అయన ఆశయాలను కొనసాగించే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మనోవికాస కేంద్రంలో..

కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని అనాథ పిల్లలు, మానసిక వికలాంగ పిల్లలతో కలిసి జరుపుకున్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని వారి నివాసంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి అనాథ పిల్లలతో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అనాథ, మానసిక వికలాంగ పిల్లలు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు డాక్టర్ కడియం కావ్య తన తండ్రిగారైన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిల్పూర్ బుగులు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి ప్రతిమను అందించారు.







# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం 13, 22వ డివిజన్ల కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, సురేష్ జోషిలతో కలిసి మేయర్ క్షేత్రస్థాయిలో బ్యాంకాలని, డాక్టర్స్ కాలనీ, సీకేఎం కాలేజ్ మెయిన్ రోడ్, లక్ష్మీ నగర్, మర్రి వెంకటాద్రి కాలనీ తదితర ముంపునకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అధికారుల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన కచ్చ నాళాలు కొట్టి నీటిని దిగువకు పంపాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణం నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఏఈ సతీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం నగరంలో వరద ముంపు నివారణ చర్యలు, అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో మేయర్ గుండు సుధారాణి సమీక్షించారు.

# పేదల పక్షపాతి వైఎస్సార్

## ఘనంగా 75వ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వెంకట్రామ జంక్షన్ లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, గుల్లపల్లి రామకృష్ణ, పప్పు వేణు, సర్దార్ జస్వీర్ సింగ్, కట్కూరి అన్వేష్, కొండమీది సదానందం, దౌడు నాగరాజ్, శ్యామల, మార్క్, ఎలదండ శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జంగం రజిత, గూడా శారద, రమ్య తదితరులు పాల్గొన్నారు.



### పంజాగుట్ట సర్కిల్‌లో..

పేదలకు కార్పొరేట్ విద్య, వైద్యం, అనేక సంక్షేమ పథకాలను అందుబాటు లోకి తెచ్చిన సమ సమాజ దార్శనికుడు దివంగత వైఎస్.రాజశేఖర్ రెడ్డి అని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు కొనియాడారు. 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నాడు పంజాగుట్ట సర్కిల్ లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పూల మాల సమర్పించి, ఘన నివాళి అర్పించారు.



# పదోన్నతులు పొందిన టీచర్లకు సన్మానం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఇటీవల పదోన్నతులు పొంది డోర్నకల్ తో పాటు ఇతర మండలాలకు వెళ్లిన టీచర్లకు తెలంగాణ స్టేట్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) డోర్నకల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా అధ్యక్షులు మురళి కృష్ణ, మాజీ రాష్ట్ర కార్యదర్శి బండి నర్సింహ రావు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గడిచిన ఎన్నో దశబ్దాలుగా యూటీఎఫ్ టీచర్ల ఐక్య పోరాటాల ద్వారా పదోన్నతులు సాధించుకున్నామన్నారు. ఇప్పుడు జరిగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తూ ప్రమోషన్లు సజావుగా జరిగెలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ వివేక్, ఉష శ్రీ, జీసీడీఓ విజయ కుమారి, మాధవి, రమ, పుష్ప సీనియర్ టీచర్ గోపి రెడ్డి, మండల నాయకులు సోమనబోయిన శ్రీను, నిజామియా, సాహెబ్ అలీ, లక్ష్మి ప్రసాద్, సాత్విక్, కాసు మారెడ్డి, వెంకటప్పయ్య, అమీన్, నామ రామారావు, రాములు, సీతారాములు, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఫింగర్ ప్రింట్ తొలగించాలి

## ఏఐటీయూసీ డిమాండ్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు వేలు ముద్ర సిస్టం (ఫింగర్ ప్రింట్)ను తొలగించాలని, అలాగే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికులకు కూడా దీనిని తొలగించాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన జయశంకర్ జిల్లా బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొడుదుల వెంకటేష్ మాట్లాడుతూ బీఓసీ సాఫ్ట్ వేర్ అప్ డేట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ వలి, నారమల్ల లక్ష్మీరాజం, బండారి లావణ్య, భీముని సిరివెన్నెల శేఖర్, ఓట్ల సిద్ధం రాజు, గౌతం, నారాయణ, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** వాతావరణంలో వస్తున్న మార్పులనుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సంగెం మండలం కాపుల కానిపర్తి గ్రామంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి

## మూడో రోజుకు చేరిన అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంగన్వాడి టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్ కు రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులకు నష్టపరిచే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా నిధులు తగ్గించడం, ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉండడం ఏ మాత్రం సరికాదన్నారు. అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.మీనా, పి.రజిత, జే.మమత, ఆర్.సరోజన, ఎం.మణెమ్మ, పి.సుగుణ, విజయమ్మ, జి.రాజమ్మ, టి.కాంతమ్మ, కౌసల్య, పూలమ్మలతోపాటు అంగన్వాడి లు పాల్గొన్నారు.


# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని ఉరుసు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచ నవీన్, కంచ ప్రవీణ్ తల్లిదండ్రులు కుమారస్వామి, లక్ష్మి విచ్చేసి నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నళిని, ఉన్నత పాఠశాల హెచ్ఎం దరావత్ పూసారాం, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహా రాములు, కోరే రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కలకోట్ల విజయ, ఉపాధ్యాయులు మార్గం నవీన్ కుమార్, రామా వివేకానంద, కౌమలత, వెంకటేశ్వర్లు, చక్రపాణి, హైమవతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములపై నిర్ణయం తీసుకోండి

## రాష్ట్ర మంత్రి సీతక్కకు వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసైన్డ్ భూముల చట్టం 1977ను రద్దుచేసి రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల పైచిలుకు ఉన్న అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి అసైన్డ్ రైతులకు శాశ్వత హక్కులు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు ఏబీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలలో ఇచ్చినవే అధికంగా ఉన్నాయన్నారు. పీఓటి చట్టం1977 ప్రకారం వీటిని అమ్మడానికి, కొనుగోలు చేయడానికి, బ్యాంకులో తనకా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి అవకాశం లేకపోవడం వలన పేదలు, అసైన్డ్ రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీని కోసం దశాబ్ద కాలంగా ఏబీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్నామని, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలు అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించి పట్టా భూములుగా మారుస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి మాట తప్పారని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు మాట నిలబెట్టుకొని పేదలకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అసైన్డ్ రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మొదలగు పేద అసైన్డ్ రైతుల కోసం చేస్తున్న పోరాటం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఏబీఎస్ సలహాదారు వేముల రమేష్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు పోలేపాక మల్లేశం, మోరే ఐలయ్య పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీ

## ఉత్తర్వులు జారీ చేసిన డీఈఓ రాజేందర్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీని కల్పిస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ కు చెందిన వర్కింగ్ జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు వినతి పత్రం అందజేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి రాయితీ కాపిని జర్నలిస్ట్ లకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు జిల్లాలోని జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, పావుశెట్టి శ్రీనివాస్, బెల్లం తిరుపతి, తడుక సుధాకర్‌లు ఉన్నారు.



# ఏక్ పేడ్ మా కే నామ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గం 34వ డివిజన్ పరిధిలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ నాయకులు, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛమైన గాలి, నీడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని, నాటిన ప్రతి మొక్కను బతికించాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. మానవాళికి మనుగడకి చెట్ల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. మొక్కలు నాటడం కన్నా వాటిని సంరక్షించడం గొప్ప అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కొనసాగించి మొక్కలను సంరక్షిదామని కోరారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు చింతల అనిల్, బూత్ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, శెట్టి రమేష్, టీవీఎలన్ శ్రీనివాస్, ఉషారాణి, సాగరిక, స్వరూప, స్రవంతి, కల్పన, ముత్తునేని రవి, విజయ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్ల అరెస్ట్

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పర్వతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక ఎస్సై గూగులోత్ వెంకన్న సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిలో ఐదుగురిని పట్టుకోగా ఒకరు తప్పించుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.12,020 నగదు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# పేదల భూమి కబ్జా

## రిపోర్టర్ నంటూ బెదిరింపులు

## పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

## ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రిపోర్టర్ నంటూ పేరు చెప్పుకొని చేస్తున్న ఆగడాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. పోలీసులు సైతం భూ ఆక్రమణ దారులకే వంత పాడడంతో నిజమైన పేదలకు న్యాయం జరుగడంలేదు. ఇలాంటి సంఘటనే శాయంపేట మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలు అరుణ తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేటలో నివాసముంటున్న కుసుమ అరుణకు సర్వే నెంబర్ 405లో ఎకరన్నర వ్యవసాయ భూమి ఉంది. దీనిని 1966 సంవత్సరంలో అరుణ మామగారైన కుసుమ స్వామి జిన్నా విజయ్ పాల్ రెడ్డి వద్ద కొనుగోలు చేశారు. 28 జూన్ 2008లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటినుంచి గ్రామ పంచాయతీకి కిస్తు కూడా చెల్లిస్తున్నారు. కాగా వెలుగు భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా చెప్పుకొంటున్న అల్లం హరి వెంకటరమణ ఇటీవల మా భూమిని దున్ని కంది వేశారు. దున్నుతున్న సమయంలోనే మేము వెళ్లి ప్రశ్నించగా నేను రిపోర్టర్ ను..నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు..మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండంటూ చెప్పడంతో 6 జూన్ 2024లో స్థానిక శాయంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. చెల రోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా మమ్ములనే భూమి మీదకు పోవద్దంటూ హుకుం జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా హరి వెంకటరమణ దౌర్జన్యంగా వ్యవహరిస్తూ నీ కొడుకును చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఒక్క ఫోన్ చేస్తే భూపాలపల్లినుంచి వచ్చి చంపుతారంటున్నారన్నారు. దీంతో తన కొడుకుకు ప్రాణ భయం ఉందన్నారు. గతంలో కూడా హరి వెంకటరమణ రెండు ఎకరాల శిఖం భూమిని కబ్జా చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. నెల రోజులైనా ఎస్సై వ్యవహార శైలి హరి వెంకటరమణకే అనుకూలంగా ఉండడంతో విసుగు చెంది భూపాలపల్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణను ఆశ్రయించినట్లు ప్రతించారు. వివరాలన్నీ ఆయనకు తెలిపినట్లు వెల్లడించారు. రిపోర్టర్ పేరు చెప్పి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే స్థానిక ఎస్సైకి ఫోన్ చేసి భూ ఆక్రమణపై స్పందించాలని సూచించినట్లు తెలిపారు.



### ఖండన..

మా అత్త మామిడి తిరుపతమ్మకు సంబంధించిన పట్టా భూమిపై సర్వ హక్కులు ఆ కుటుంబ సభ్యులకే ఉన్నాయని జర్నలిస్ట్ అల్లం హరి తెలిపారు. అన్యాయంగా తనపై కుసుమ అరుణ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యేకు తమపై అనవసరంగా ఫిర్యాదు చేశారని ఆయన పేర్కొన్నారు. న్యాయబద్ధంగా రెవెన్యూ, పోలీస్ అధికారులు తీసుకునే నిర్ణయానికి మా అత్త కుటుంబం కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. విలేఖరి ముసుగులో తాను భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.

# పోలీసులకు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అనాథ మహిళను అక్కున చేర్చుకొని మునిసిపల్ కార్మికుల సహకారంతో స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపజేయించి 108 వాహనంలో ఎంజీఎంకు తరలించి మానవత్వం చాటుకున్న పోలీసులను వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏసీపీ నందిని రామ్ నాయక్, మట్టేవాడ సీఐ తుమ్మ గోపి సహకారంతో కానిస్టేబుల్లు తుమ్మల కళ్యాణ్ కుమార్ శర్మ, డీఆర్ఎఫ్ లో పనిచేస్తున్న ఎండిఖాలీద్ అలీ, కె.శ్రీనివాస్, మహేందర్, దయాకర్ ఎస్ఎఫ్, ఎన్.రాజులను ఏసీపీ చేతుల మీదుగా సన్మానించారు. ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సేవలో మేము మా వంతు పాత్ర పోషిస్తామని పోలీసులు నిరూపించారన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 08, జులై 2024
7

# కల్కి రికార్డు కలెక్షన్లు

**900 కోట్లు దాటిన వసూళ్లు**

ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తూ కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 11 రోజుల్లో ఈ మూవీ రూ.900 కోట్లకు (గ్రాస్) పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పుడు మరో అరుదైన మైలురాయికి చేరువలో ఉంది. ఇదే హవా కొనసాగితే ఒకట్రెండు రోజుల్లో రూ.1000 కోట్లు మార్కును అందుకోవడం ఇక లాంఛనమే. అప్పుడు ఈ ఘనత సాధించిన ఏడో భారతీయ చిత్రంగా 'కల్కి' నిలుస్తుంది. మరోవైపు హిందీ ప్రేక్షకులు 'కల్కి' మూవీకి ఫిదా అవుతున్నారు. ప్రభాస్, అమితాబ్ యాక్షన్ సీక్వెన్స్, నాగ్ అశ్విన్ టేకింగ్, విజువల్ ఎఫెక్ట్స్ తదితర సన్నివేశాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్‌లో రూ.200 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన మూవీగా 'కల్కి' నిలిచింది. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత హిందీలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూవీ ఇదే కావడం గమనార్హం. ఇక ప్రభాస్ సినిమాల పరంగా చూస్తే ఇదే రెండో అత్యధిక గ్రాస్ వసూళ్లు సాధించిన చిత్రం. ఇక నార్త్ అమెరికాలో ఇప్పటివరకూ ఏ దక్షిణాది చిత్రమూ సాధించని అరుదైన ఫీట్‌ను కల్కి సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ 16 మిలియన్ డాలర్లు వసూలు చేసినట్లు ట్రేడింగ్ వర్గాలు అంచనా వేశాయి. అంతేకాదు, బుక్ మై షోలో కోటికి పైగా టికెట్లు విక్రయమైన చిత్రంగానూ రికార్డు సృష్టించింది. అలాగే, హైదరాబాద్‌లోని ఎంబిఎం సినిమాస్‌లో అతి తక్కువ సమయంలో రూ.3కోట్లు కలెక్ట్ చేసిన చిత్రంగా కల్కి నిలిచింది.




## కమల్ అంతటి నటుడిని చూడలేదు

### భారతీయుడు ప్రీ ఈవెంట్‌లో బ్రహ్మానందం





'భారతీయుడు 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనడం తన అదృష్టమని నటుడు బ్రహ్మానందం అన్నారు. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'భారతీయుడు 2' జులై 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం మాట్లాడుతూ కమల్ హాసన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. కమల్ హాసన్ వయసు ఎంతో నాకు తెలీదు. నేను చదువుకునే రోజుల నుంచి ఆయన్ని చూస్తూనే ఉన్నా. 'సాగర సగమం' చాలాసార్లు చూశాను. అందులో ఆయన నటించిన విధానం చూస్తే ఆశ్చర్యమేసింది. కమల్ హాసన్ శరీరంలోని ప్రతిభాగం పరిధిమేరకు నటిస్తుంది. అలా చేయగల ఏకైక నటుడు ప్రపంచంలో కమల్ హాసన్ మాత్రమే. ఆయన గొప్ప నటుడని ప్రతిఒక్కరూ అని తీరాలి. ఇండస్ట్రీలో ఉన్న నటులంతా కమల్‌హాసన్ చేసిన పాత్రల్లాంటివి ఒక్కసారైనా చేస్తే బాగుండు అనుకుంటారు. ఆయన మేకప్ వేసుకోవడం కోసం ఒక్కోసారి 7గంటల సమయం తీసుకుంటారు. తన జీవితాన్ని ఇండస్ట్రీకి అంతలా అంకితమిచ్చారు. ఎప్పుడూ మేకప్, యాక్టింగ్ ఈ రెండింటి గురించే ఆలోచిస్తారు. ఆయన చేయని పాత్రలు లేవు. ప్రతి పాత్రకు జీవం పోస్తారు. ముఖ్యంగా 'భారతీయుడు'లో ఆయన నటన అద్భుతం. భారతీయ సినీపరిశ్రమలో శంకర్ లాంటి ప్రతిభ ఉన్న దర్శకులు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ చిత్రబృందంలోని వారితో నేను గతంలోనూ పని చేశానని చెప్పడానికి ఎంతో సంతోషంగా ఉంది. కానీ, కమల్ హాసన్‌తో కూడా కలిసి పనిచేశాను అని చెప్పడానికి గర్వంగా ఉంది. ఆయన సినిమాలో మనం చేశాం అని కొన్ని దశాబ్దాల తర్వాత కూడా గుర్తుతెచ్చుకొని ఆనందిస్తాం అంటూ ప్రశంసలు కురిపించారు. తాను కాలేజీలో చదువుకొనే సమయంలో మిమిక్రీ చేసినట్లు బ్రహ్మానందం తెలిపారు. ఇటీవల శ్రుతిహాసన్ ఎదుట మిమిక్రీ చేస్తే 'నాన్నలానే మాట్లాడారు' అని చెప్పడంతో తనలో ఇంకా కాన్ఫిడెన్స్ పెరిగిందని తెలిపారు. స్టేజ్‌పై కమల్ హాసన్‌లా మాట్లాడి ఈ హాస్యబ్రహ్మ అందరినీ అలరించారు.



## షణ్ముఖలో ఆది పవర్‌ఫుల్ రోల్

వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ చిత్రం షణ్ముఖ. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మణానంతర పనులను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ ఈ పోస్టర్ అందరిలోనూ ఆసక్తిని రేపుతుంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటిస్తున్న విషయం తెలిసిందే. పోలీస్‌డ్రెస్‌తో ఆది పవర్‌ఫుల్‌గా కనిపిస్తుండగా, ఆయన వెనకాల షణ్ముఖ సుబ్రహ్మణ స్వామి కనిపించడం, పోస్టర్ చూసిన అందరిలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది. ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రతి పాత్ర హైలైట్‌గా వుంటుంది. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి ఎ÷-లాన్ చేస్తున్నాం. కేజీఎఫ్, సలార్ చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బసూర్ ఈ చిత్రానికి స్టనింగ్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం అత్యున్నత సాంకేతిక నిపుణులతో నిర్మాణనంతర పనులు మొదలుకానున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఓ వండర్‌ఫుల్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. తప్పకుండా ఈ చిత్రం ఆది కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది అన్నారు.

## మల్లాది నవలకు కాపీయా ?



నాని కథానాయకుడిగా, వివేక్ ఆత్రేయ దర్శకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'సరోపోదా శనివారం'. డివివి దానయ్య ఈ సినిమాకి నిర్మాత. ఈ సినిమా వచ్చే నెల ఆగస్టులో విడుదలవుతోంది. ఈ సినిమా నుండి ఇప్పటికే నాని మొదటి లుక్, అలాగే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక మోహన్ లుక్ కూడా విడుదల చేశారు. నాని ఈ సినిమాలో శనివారం నాడు మాత్రమే ఏదైనా చేస్తాడు అనేట్టుగా ఈ సినిమా టైటిల్ చూస్తేనే అర్థం అవుతోంది. అలాగే ప్రియాంక మొహం చారులత అనే పోలీసు పాత్రలో కనబడుతుంది అని విడుదల చేసిన ఆమె లుక్ బట్టి అర్థం అవుతోంది. ఇంతకీ ఈ సినిమా దర్శకుడు వివేక్ ఆత్రేయ ఒరిజినల్ కథనే తీస్తున్నాడా, లేదా ఎక్కడైనా ఏదైనా నవలని స్ఫూర్తిగా తీసుకున్నాడా అని నవలా సాహిత్యం చదివే వాళ్లలో ఒక చర్చ నడుస్తోంది. ఎందుకంటే ప్రముఖ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణ మూర్తి రచించిన 'శనివారం నాది' అనే నవల అప్పట్లో సంచలం రేపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా మల్లాది 'శనివారం నాది' అనే నవల నుండి స్ఫూర్తిగా తీసుకున్నారా? అనే ఒక వాదం వినబడుతోంది. అయితే నవలలో కూడా కథానాయకుడు శనివారం అవగానే ఏదో ఒక సంఘటనకి పాల్పడుతూ ఉంటాడు. అందులో కథానాయకుడుకి కొంచెం నెగటివ్ షేడ్స్ ఉంటాయి. అలాగే నవలలో ఒక లేడీ పోలీసు పాత్ర మంగళ చాలా కీలకమైన పాత్ర వుంది. మరి ఇప్పుడు ఈ సినిమాలో కూడా ప్రియాంక మోహన్ పోలీసు పాత్ర చారులతగా చూపించడం చూస్తుంటే, దర్శకుడు మల్లాది నవలని ఏమైనా స్ఫూర్తిగా తీసుకున్నాడా అని అనిపిస్తోంది.



# ఈ గడ్డ గౌరవాన్ని కాపాడుతా

## రణధీర పుస్తకావిష్కరణలో మంత్రి సీతక్క




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్సలైట్ ఉద్యమాల్లో పనిచేసినపుడు రణధీర పేరుతో ప్రకటనలు వచ్చేవని.. ఉనికి తెలియకుండా ఇలాంటి పేర్లు వాడేవాళ్లమని.. తనకు నచ్చిన పేరు పుస్తకం టైటిల్ లో ఉండటం ఎంతో ఆనందాన్నిచ్చిందని, అలలకు ఎదురీదుతున్న తన జీవితాన్ని శక్తివంతంగా, ప్రభావశీలంగా నమోదు చేసిన రణధీర సీతక్క పుస్తకం మరింత బాధ్యత పెంచిందని పంచయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ గడ్డ గౌరవాన్ని కాపాడుతానన్నారు. డీకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అస్నాల శ్రీనివాస్ మంత్రి సీతక్క జీవితంపై రాసిన 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ సభ హనుమకొండ జడ్పీ హాల్ లో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, విశిష్ట అతిథులుగా ఎంపీ కడియం కావ్య, తేజావత్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పుస్తకంపై తన స్పందన తెలియజేస్తూ ప్రసంగించారు. ఆదివాసి మహిళ అని చూడకుండా తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ప్రత్యర్థులు తనపై, తన వ్యక్తిత్వం పై విష ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం స్థానిక వనరులపై తమ ఆధిపత్యం దక్కలేదనే అక్కసుతో ఇదంతా చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు కోయజాతిలో మంత్రులుగా అవకాశం దక్కిన వారే లేరు.. అందులో మహిళకు అరుదైన గౌరవం లభించిందన్నారు. దీనిని కొందరు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

### అడవి పూవు సీతక్క : ఎంపీ కడియం కావ్య

అచ్చమైన అడవి పూవు సీతక్క అంటూ ఎంపీ కడియం కావ్య పోల్చారు. మంత్రి సీతక్క గురించి ఎన్నో తెలియని విషయాలు తెలుసుకున్నానని.. మొదటి మహిళా దళ కమాండర్, మొదటి సారిగా ఏకే 47 పట్టిన మహిళగా పేరు తెచ్చుకోవడం గొప్ప విషయమన్నారు. పుస్తకాలు ఎక్కువగా చదవుతూ.. మనుషుల్ని ఎక్కువగా కలిస్తేనే మనకున్న నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. నిరంతర పోరాటశీలి.. నూరుశాతం ప్రజల్లో ఉండే మనిషి అన్నారు. తనలాంటి వెనకబడిన వర్గాల నుంచి మహిళలకు సీతక్క ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా సీతక్క కావ్యను ఆత్మీయ ఆలింగనం చేసుకుంది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ సంగోజు రవి, టీజీవో ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, నరసింహులు, అప్పారావు, భోనగిరి రాములు, బిల్లా మహేందర్, మడిపెల్లి రమేష్ గౌడ్, పాండురంగారావు, సురేష్, రామక్రిష్ణ గౌడ్, కవులు, రచయితలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆదర్శ కాలనీ ప్రధాన కార్యదర్శిగా వేణు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ 53వ డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ 13వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదర్శ కాలనీలోని అభి నిలయంలో జరిగినది. ఈ సందర్భంగా జరిగిన అభివృద్ధి కమిటీ ఎన్నికల్లో కాలనీవాసులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణును 13వ సారి ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదర్శ కాలని అభివృద్ధి కమిటీ ప్రారంభమైనప్పటి నుంచి నేటివరకు వేణు ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నందుకు నాపైన చూపుతున్న ఆదరాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. వారు నా పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సహాయ సహకారాలతో నా శక్తిమేరకు కాలని అభివృద్ధికి పాటుపడతానన్నారు.

# డయేరియాపై యుద్ధం

## స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్షాకాలంలో డయేరియా ప్రబల కుండా "స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అడిషనల్ కలెక్టర్ లు వెంకట్ రెడ్డి, రాధికా గుప్తా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు, సీపీఓ సత్య నారాయణ రెడ్డి ఇతర జిల్లా అధికారులతో కలసి డయేరియా అవగాహన కార్యక్రమాల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా నియంత్రణపై ఆగస్టు 31 వరకు జిల్లా వైద్య, ఆరోగ్య, విద్యా, సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, పురపాలక సంఘాలు, నీటిపారుదల శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలీల అభివృద్ధికి కృషి

## పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్

## హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పద్మశాలి కులాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని, పద్మశాలి కులస్తులంతా ఐక్యంగా ఉండి అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని వి గ్రాండ్ బాంకెట్ హాల్లో ఏర్పాటు చేసిన పద్మశాలి కులస్తుల ప్రత్యేక సమావేశానికి వడ్నాల నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ, సామాజిక రంగాల్లో పద్మశాలి కులస్తులు ఎంతో వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా పద్మశాలిల అభ్యున్నతికి ప్రభుత్వాలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరువ చూపుతానన్నారు. పద్మశాలి కులస్తులు రాజకీయంగా అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. కొత్తగా ఎన్నికైన హనుమకొండ జిల్లా కమిటీ పద్మశాలి కులస్తుల సమస్యల సాధనకు పోరాడుతూనే ఉండాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన హనుమకొండ పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లను ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆడేపు రవీందర్, ప్రధాన కార్యదర్శి గోరంటాల రాజు, కమలాపూర్ మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, జానకిరామ్, పలు డివిజన్, మండలాల కుల సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక..

హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం నూతన కమిటీని సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శిగా కేదాసి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పొట్టి బత్తిని విజయ్, పొరండ్ల రమేష్, గజ్వేల్ రవీందర్, మార్త భిక్షపతి, నల్ల సత్యనారాయణ, దేవులపల్లి జానకి రాములు, బత్తుల రమేష్, కోశాధికారిగా సత్యారి సంతోష్ రాజు, కార్యదర్శులుగా వలుపదాసు రాజన్న, తుమ్మ శోభన్ బాబు, మంత్రి కాశయ్య, వేముల సమ్మయ్య, బింగి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా ఆకుబత్తిని వెంకట్రాం నరసయ్య, గాజుల సత్యనారాయణ, వెంగళ బాలకృష్ణ, వేముల సతీష్, కందికట్ల ప్రశాంత్, దేవులపల్లి సదానందం, గాడిపెల్లి సత్యనారాయణ, కనుకుట్ల లింగమూర్తి, గడ్డం మధుకర్, పాము శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నేతాజీ పెయింటింగ్ యూనియన్ ఎన్నిక..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐనవోలు మండలం కొండపర్తి గ్రామ నేతాజీ పెయింటింగ్ యూనియన్ నూతన కమిటీని గౌరవ అధ్యక్షులు గద్దల సత్యం, గౌరవ సలహాదారులు మచ్చిక రమేష్చ, మాజీ అధ్యక్షులు కట్కూరి రహీం, కట్కూరి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షులుగా కట్కూరి రాజు, ఉపాధ్యక్షులుగా బొక్కల సారయ్య, ప్రధాన కార్యదర్శిగా గద్దల ప్రభాకర్, కార్యదర్శిగా గద్దల రాజ్ కుమార్, కోశాధికారిగా నాగరపు స్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కట్కూరి రాజు మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# రిటైర్డ్ ఎస్సైకి సన్మానం



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రేగొండ మండలం, దుంపిల్లపల్లి గ్రామ వాస్తవ్యులు రమణా రెడ్డి మంగళవారం హనుమకొండలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమణా రెడ్డిని మాజీ ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL. TELANGANA STATE. NEWS NETWORK INCHARGE : SAMALA SURYAPRAKASH, CELL: 9849943339
RNI : TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com